వైద్య శిబిరానికి హాజరైన పట్టణవాసులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 4: సికింద్రాబాద్ యశోద దవాఖాన సౌజన్యంతో ఆదివారం పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్యాంప్‌లో 140 మందికి నరాలు, ఎముకలు, గుండె పరీక్షలతోపాటు జనరల్ టెస్టులు చేశారు. సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు హేమంత్ కుమార్ చౌదరి, శీతల్ కుమార్, జయకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంజిరెడ్డి, కార్యదర్శి కాసం శ్రీనివాస్, బెజుగం వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం..

బాన్సువాడ, ఫిబ్రవరి 4: లయన్స్ క్లబ్ వైద్య శిబిరం నిర్వహిస్తున్న సమయంలో మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రక్తం అవసరం ఉందని సమాచారం అందింది. దీంతో పట్టణానికి చెందిన చెందిన వ్యాపారవేత్త తాటి రామకృష్ణ స్పందించి రక్తదానం చేశారు.

నవోదయ, గురుకుల మోడల్ టెస్ట్


ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ సత్యనారాయణ

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 4: ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయికీర్తి కళాశాలలో విద్యార్థులకు ఆదివారం గురుకులం, నవోదయ మోడల్ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పట్టణ సీఐ సత్యనారాయణ హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఆర్ ఫౌండేషన్‌ను ఈ సందర్భంగా సీఐ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్, సభ్యులు రోటె సాయిలు, కుమ్మరి సాయికుమార్, గోపాల్, లావణ్య, సాయిలు, సలీం, ఉపాధ్యాయులు మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలో ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణ గత నెల హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక పాఠశాలలో డీఈవో రాజు శనివారం సన్మానించారు.

మూలమలుపులు.. మృత్యు పిలుపులు

- కార్నర్ల వద్ద రోడ్లపై కనిపించని సూచిక బోర్డులు
- రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు
- పట్టించుకోని అధికారులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

డోంగ్లీ, ఫిబ్రవరి 4: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై ఉన్న మూలమలుపులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. మూల మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. 'ఈ మలుపులు.. పరలోకానికి పిలుపులు' అని వాహనదారులు భయపడుతున్నారు. డోంగ్లీ నుంచి లింబూర్ వెళ్లే దారిలో రెండు ప్రదేశాల్లో, లింబూర్ నుంచి హసన్ టాక్లీకి వెళ్లే దారిలో మూడు ప్రదేశాల్లో, హసన్ టాక్లీ నుంచి పెద్ద టాక్లీ మార్గంలో రెండు ప్రదేశాల్లో, డోంగ్లీ నుంచి కుర్లా వెళ్లే దారిలో ఒక ప్రదేశంలో మూల మలుపులు ఉన్నాయి. ఈ మలుపులన్నీ ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రహదారిపై చెట్లు ఏపుగా పెరగడంతో మూలమలుపుల వద్ద దగ్గరకు వెళ్లే వరకు వాహనాలు కనిపించడంలేదని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. భారీ వాహనాలు ఎదురుగా వస్తే.. బైకులు రోడ్డు కిందకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

మూలమలుపు వద్ద రోడ్డుకు ఇరు వైపులా పెరిగిన ముండ్ల చెట్లు

అధికారులు స్పందించాలి..

డోంగ్లీ – లింబూర్ – సిర్‌పూర్ దారిలోని మూలమలుపుల వద్ద ముళ్ల కంపలు, చెట్లు పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ప్రమాదాలు జరిగి వాహనదారులకు గాయాలవుతున్నాయి. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించాలి. సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

- ఎస్.మహేశ్, డోంగ్లీ

బెల్టు షాపు మూసివేయాలి

వీడీసీకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భిక్కనూరు, ఫిబ్రవరి 4: మండలంలోని జంగంపల్లి గ్రామంలో బెల్టుషాపును వెంటనే మూసి వేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులను అదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో బెల్టుషాపు ఉండడంతో యువకులు మద్యానికి బానిసలుగా మారుతున్నారని తెలిపారు. మద్యం కారణంగా అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు శివలింగం, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

పిట్లం, ఫిబ్రవరి 4: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై విజయ్‌కొండా అన్నారు. ఆదివారం పిట్లం– బాన్సువాడ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరాలు

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 4 : బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 ఆధ్వర్యంలో శీతాకాల శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆదివారం దేశాయిపేట్‌లో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తూ యూనిట్–1 వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. సోమేశ్వర్ గ్రామంలో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలు, మూఢ నమ్మకాలపై యూనిట్ – 2 ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కొల్లూరు గ్రామంలో యూనిట్–1, 2 ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు యాదాగౌడ్, గంగాధర్, రుక్మిణి, అధ్యాపకులు విఠల్, నరేశ్, దయానంద్, స్వప్న, స్వరూప్‌కుమార్, మహేశ్, ఆరిఫ్, అనుపమ పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, ఫిబ్రవరి 4 : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకొని ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి తెలిపారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి, ఫిబ్రవరి 4: పట్టణంలోని కాసర్ల విహార్‌లో ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. రాఘవేంద్రరావు, స్వామిరెడ్డి జోడి విజేతగా నిలువగా రూ.10వేల నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. రామకృష్ణ, విష్ణు రెండోస్థానం సాధించారు. కార్యక్రమంలో 12, 35వ వార్డు కౌన్సిలర్లు కాసర్ల గోదావరీ స్వామి, పోలీస్ కృష్ణాజీరావు, ఏఎంసీ డైరెక్టర్ కాసర్ల రవీందర్, ముకుందరావు, రాజశేఖర్, గంగన్న క్రీడాకారులు పాల్గొన్నారు.

11 నుంచి టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

కామారెడ్డి, ఫిబ్రవరి 4: టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్ర విద్యా మహాసభలను ఖమ్మంలో ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర బాధ్యుడు పాతూరి మహేందర్‌రెడ్డి తెలిపారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్లను సీనియర్ నాయకులు హన్మాండ్లు, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, అనిల్ కుమార్‌తో కలిసి పట్టణంలో ఆదివారం ఆవిష్కరించారు. మహాసభలకు విద్యావేత్తలు, రాష్ట్ర మంత్రులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ నాగభూషణం, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు

ఆలయాలకు భక్తుల పాదయాత్ర

మద్నూర్ నుంచి నెమ్లి సాయిబాబా ఆలయానికి, గాంధారి నుంచి పండరిపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

మద్నూర్/ గాంధారి, ఫిబ్రవరి 4: గాంధారితోపాటు పొతంగల్ కలాన్, సర్వాపూర్, మేడిపల్లి, గండివేట్, గౌరారం, సీతాయిపల్లి, ముదెల్లి తదితర గ్రామాలకు చెందిన పలువురు విఠలేశ్వరుని భక్తులు ఆదివారం పాదయాత్రగా మహారాష్ట్రలోని పండరీపూర్‌కి బయల్దేరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విఠలేశ్వరాలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భజనలు చేస్తూ, పాటలు పాడుతూ ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. మార్గమధ్యంలో సర్వపూర్ విఠలేశ్వరాలయం, ముదెల్లి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 450 కిలోమీటర్ల దూరంలో ఉన్న పండరీపూర్ చేరుకోవడానికి 13 రోజుల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. మద్నూర్ నుంచి పలువురు భక్తులు బీర్కూర్ మండలంలోని నెమ్లి సాయిబాబా ఆలయానికి ఆదివారం పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. ఉదయం సాయిబాబా ఆలయంలో పూజలు చేసిన అనంతరం గ్రామ ప్రత్యేకాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. సాయి పల్లకీ రథం వెంట పాటలు పాడుతూ పాదయాత్ర కొనసాగించారు. మార్గమధ్యంలో ఆయా గ్రామాల్లో దాతలు పాదయాత్ర భక్తులకు అల్పాహారం, భోజనం, మజ్జిగ, తాగునీరు అందజేశారు.

కొనసాగుతున్న నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్‌లో ఆదివారం నాటి నీటి నిల్వలు

నిజాంసాగర్, ఫిబ్రవరి 4: నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగు చేస్తున్న లక్షా 25వేల ఎకరాల్లో పంటల కోసం నాలుగో విడుత నీటి విడుదల కొనసాగుతున్నట్లు ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగుల (17.80 టీఎంసీల)కు గాను ఆదివారం సాయంత్రానికి 1400.05 అడుగుల (11.41 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నది. ప్రధాన కాలువ ద్వారా 1505 క్యుసెక్కుల నీరు విడుదల కొనసాగుతున్నదని తెలిపారు. ఆయకట్టు కింద సాగుచేస్తున్న పంటల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదలను హెచ్చుతగ్గులు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు మూడు విడుతల్లో 6.60 టీఎంసీల నీటిని విడుదల చేయగా.. నాలుగు రోజులుగా నాలుగో విడుత నీటి విడుదల కొనసాగుతున్నదని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నిజాంసాగర్, ఫిబ్రవరి 4: మండల సర్వసభ్య సమావేశాన్ని నేడు (సోమవారం) నిర్వహించనున్నట్లు నిజాంసాగర్ ఎంపీడీవో నాగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పట్లోల్ల జ్యోతి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుతోపాటు జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

నిజాంసాగర్, ఫిబ్రవరి 4: మండలంలోని గోర్గల్ గ్రామ శివారులో ఉన్న బేడీల మైసమ్మ ఆలయంలో మాగి గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఆదివారం పండుగ నిర్వహించారు. ఉదయం బోనాలు తీసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గాయత్రీ షుగర్స్ వైస్ చైర్మన్ వేణు గోపాల్‌రావు, కేన్ మేనేజర్ వెంగల్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

పిట్లం, ఫిబ్రవరి 4: గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15న నిర్వహించనున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని లంబాడాల ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాట్రోత్ రవీందర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలవు దినం ప్రకటిస్తే గిరిజనులు సేవాలాల్ జయంతిని వైభవంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

కామారెడ్డికి తరలిన గౌడ కులస్తులు

సదాశివనగర్, ఫిబ్రవరి 4: కామారెడ్డి పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జిల్లా గౌడ సంఘం ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు సదాశివనగర్ నుంచి గౌడ సంఘం ప్రతినిధులు తరలివెళ్లారు. కామారెడ్డికి తరలిన వారిలో బోంబోతుల లింగాగౌడ్, తీగల నాగాగౌడ్, మొగుళ్ల గంగాగౌడ్, యాదాగౌడ్, మైసాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, నర్సాగౌడ్, మొగుళ్ల రామాగౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు ఉమ్మడి నిజాంసాగర్ మండలంలో జుక్కల్ ఎమ్మెల్యే పర్యటన

నిజాంసాగర్, ఫిబ్రవరి 4: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతా రావు సోమవారం మండలంలో పర్యటించనున్నారు. సుల్తాన్‌నగర్‌లో నిర్వహించే సన్మాన సభ, నిజాంసాగర్ బస్టాండ్‌లో మరుగుదొడ్లు, నిజాంసాగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రహరి నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. అనంతరం అచ్చంపేట మోడల్ పాఠశాల సందర్శన, మండల కేంద్రంలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం, మహ్మద్‌నగర్, సింగీతంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాలు, శేర్కాన్‌పల్లిలో సన్మాన కార్యక్రమంతోపాటు సాయంత్రం బిచ్కుందలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రామారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ఎల్లారెడ్డి/ రామారెడ్డి, ఫిబ్రవరి 4: ఎల్లారెడ్డి, రామారెడ్డి మండల కేంద్రాల్లో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశాలకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ బీబీ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సర్వీసు రోడ్డును పొడిగించాలని వినతి

సదాశివనగర్, ఫిబ్రవరి 4: పద్మాజివాడి ఎక్స్ రోడ్డు వద్ద 44వ నంబర్ జాతీయ రహదారి వద్ద బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్వీస్ రోడ్డును పొడిగించాలని కోరుతూ మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పలువురు ఎంపీ బీబీ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీ పాటిల్ స్పందిస్తూ.. ప్రజల కోరిక మేరకు నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి సర్వీస్ రోడ్డును పొడిగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో పద్మాజివాడి విండో మాజీ డైరెక్టర్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ కుంట నర్సారెడ్డి, రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరత్ రెడ్డి, జిల్లా గిరిజన నాయకుడు లింబాద్రి నాయక్, గాంధారి మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ రావు తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★నిజామాబాద్‌లో పనిచేయుటకు LADY CARE TAKER కావలెను. భోజనం + వసతి సౌకర్యం + జీతం ఇవ్వబడును. సంప్రదించండి. ఫోన్ : 9154545433
NTZ-324515

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ వద్ద టెంట్ ఏర్పాటు

ఎల్లారెడ్డి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 4: ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎల్లారెడ్డి బస్టాండ్ వద్ద బాన్సువాడ బస్‌డిపో మేనేజర్ సరితాదేవి ఆదివారం తాత్కాలిక టెంట్‌ను వేయించారు. బస్టాండ్ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఎల్లారెడ్డి బస్టాండ్ వద్ద ప్రయాణికులకు నీడ లేని పరిస్థితి ఏర్పడింది. సమస్యను గుర్తించిన బాన్సువాడ డిపో మేనేజర్ టెంట్‌ను ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

బస్టాండ్‌ను సందర్శించిన డీఎం..

నిజాంసాగర్, ఫిబ్రవరి 4: నిజాంసాగర్ బస్టాండ్‌ను బాన్సువాడ డిపో మేనేజర్ సరితాదేవి ఆదివారం సందర్శించారు. రూ.20 లక్షల వ్యయంతో బస్టాండ్ ఆవరణలో నిర్మించే మరుగుదొడ్ల పనులను ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సోమవారం ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు పరిశీలించమని అన్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రామారెడ్డి, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో ఆజాద్ యూత్ క్లబ్ సభ్యులు ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గురుజకుంట స్వామి, ఉపాధ్యక్షులుగా బండకింది రమేశ్, లింగాల సాగర్‌గౌడ్, కార్యదర్శిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా శివరాం శ్రీధర్‌గౌడ్, నరేశ్, సందీప్, ఆటల కార్యదర్శులుగా వడ్ల నవీన్, మోషంపల్లి ప్రశాంత్, కోశాధికారిగా చాతరబోయిన డిష్ రవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు వడ్ల నారాయణ, కట్ట ఈశ్వర్, రంగు రవీందర్‌గౌడ్, ఎస్‌డీ ఖాజా, రాజేశ్వర్, దర్ని ప్రవీణ్, గడ్డం రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 4: ఈనెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మె పోస్టర్‌ను జుక్కల్‌లో ఆదివారం ఆవిష్కరించారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ కార్మికుల సమన్వయ కమిటీ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్ గొండ ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భోజన ఏజెన్సీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సరస్వతి, పుష్ప, నాగమణి, స్వరూప, గంగామణి, లలిత, సునంద, లక్ష్మి, బుజ్జీబాయి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 4: పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సీవోఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ మీనాక్షి తెలిపారు. మొత్తం 248మంది విద్యార్థులకు గాను 232 మంది హాజరవగా.. 16మంది గైర్హాజరయ్యారన్నారు.

పాలకవర్గానికి సన్మానం

నిజాంసాగర్, ఫిబ్రవరి 4: మండలంలోని మాగి సర్పంచ్ కమ్మరి కత్త అంజయ్య, మంగ్లూర్ సర్పంచ్ స్వప్నా రమేశ్‌తోపాటు పాలకవర్గ సభ్యులకు ఆదివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఐదేండ్ల పాలనలో వారు గ్రామాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తామని మాజీ పాలకవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.